# శృంగాటకము

"ఏకలవ్యుడు"

విశాఖపట్టణానికి పిచ్చిఆసుపత్రి ఎలాంటిదో— ఆంధ్రదేశానికి విశాఖపట్టణం అలాంటిది —

చిలుముతోనై —
పత్తిరితోనై —
చిలుము పత్తిరిల మధ్య
చెలగిఉన్నాడే గురుబోధ॥
(అని సన్యాసులు పాడినట్లు—)
పిచ్చితోనై —
ఆసుపత్రితోనై
పిచ్చి - ఆసుపత్రిలమధ్య
చెలగి ఉన్నాడే - విశాఖ—

—అని రాజకీయ సన్యాసులు అప్పుడప్పుడు పాడుకుంటూ ఉంటే బావుంటుందనిపిస్తుంది.

ఏమంటే—పిచ్చి ఆసుపత్రి విశాఖపట్టణానికి ఎంత పేరు తెచ్చిందో — విశాఖపట్టణం ఆంధ్రదేశానికి అంత పేరుసంపాదించి పెట్టింది —

తెల్లారిలేస్తే— పిచ్చిఆసుపత్రి ఎన్ని పేచీలు తెచ్చిపెడుతుందో—విశాఖపట్నంకూడా ఆంధ్రదేశానికిఅన్ని పేచీలూ తెచ్చిపెడుతూ ఉంటుంది.

"అలావిశాఖలో పుట్టిన పేచీలు పెద్దశిఖపట్ల గోత్రాలై" ఆంధ్ర దేశాన్ని అంతనూ ఓవూపు వూపి అనూరాధలోఅణగి పోతూ వుంటాయి...

ఎంత అణగిపోయినా, అవి 'అణు'బాంబులా అప్పుడప్పుడు చిటపటలాడటం మాత్రం మానవు!.

ఈవేళ నేగాదు—గడచిన పాదశతాబ్దంనుండి మనకిది పరిపాటే...!

విశాఖ పట్టణంలో 'పిచ్చిఆసుపత్రి' ఎప్పుడు పుట్టిందో నాకుతెలియదుగాని, 1926 సంవత్సరంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం విశాఖ పట్టణంలో అవతరించి నప్పటినుండి_ఆంధ్రరాజకీయాలకు 'విశాఖ పట్టణం' పిచ్చి ఆసుపత్రిఐ కూర్చుంది —

అప్పటినుండి 'విశాఖ'లో ఏమహాసభలు జరిగినా, ఏదోఒక 'పిచ్చి' అల్లరి బయలు దేరుతూనే వున్నది.

'ఆంధ్రవిశ్వ విద్యాలయం' అనేపిచ్చి ఆంధ్ర రాజకీయాలకు ఏముహూర్తాన పట్టిందోగాని_ ఎన్నిమందులు వేసినా, ఎందరు డాక్టర్లు తన్నుకున్నా - ఈనాటివరకు అది నివృత్తికాలేదు. ఆంధ్ర విశ్వ విద్యాలయోపాధ్యక్షులు శ్రీకట్టమంచివారు ఎంత 'మంచికట్లు' కట్టినా,విరిగిన 'ఆంధ్రమనస్సు' విరిగినట్లు గానే వున్నదిగాని, ఇంతవరకు అతుక్కోలేదు—

''ఇనుము విరిగెనేని ఇరుమారు ముమ్మారు
కాచి యెన అతుకు కలుపవచ్చు
మనసు విరిగెనేని మరికలుప రాదయా,

కట్టమంచిరామ..."

రామలింగా రెడ్డిగారు విరిచిన కట్లు ఆంధ్ర రాజకీయాలలో 'రామలింగ' ని పాత్ర ధరిస్తూ అన్నిటినీ నవ్వులపాలు చేస్తూవుండడమేకాదు_

—అవి కాంగ్రెసాంధ్రులను కూడా కంగారు పెట్టాయి...విశాఖపట్టణం పడితే చాలు. ఏ 'కట్ల'లో; విరిచి పాయిలో పెట్టకుండా మాత్రంరారు మనకాంగ్రెసాంధ్రులు...

1935 లోకాకోలు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు "విశాఖ పట్టణం" లో జరిగిన ఆంధ్ర రాజకీయ మహాసభకు అధ్యక్షత వహించి_ ఓపిచ్చి మాట అన్నారు: "మనకు ముందు స్వరాజ్యం, ఆతరువాత స్వరాష్ట్రం" అని—

విశాఖపట్టణంలో శ్రీవారు అన్న ఆ 'పిచ్చిమాట'ను విజయవాడ వచ్చి విచారించుకొనేసరికి_ "ఎంత పిచ్చిగా మాట్లాడాను...!" అనిపించి, దానిని కప్పిపుచ్చుకోనడానికి నిజంగా ఆయనకు పిచ్చిపట్టినట్లే అయిపోయింది.—ఆమాట విని పిచ్చెక్కిపోయిన ఆంధ్రులు ఆయనను గాంధి పార్కులో చుట్టుముట్టే సరికి నిజంగా అది పిచ్చి ఆసుపత్రే అయిపోయింది...! విశాఖపట్నంలో పట్టిన పిచ్చి విజయవాడ వచ్చినా ఆయన్ను ఓపట్టాన వదలిపెట్టలేదు...

అందుచేతనే ఆయన ఆంధ్రరాజకీయాల్లో ఎప్పుడూ ఏవోపిచ్చిపనులు చేస్తూనేవుంటారు!... ఏవో పిచ్చి మాటలు అంటూనేవుంటారు...! అందుకే ఈ'పిచ్చి'ఆయనకు అందరూ దూరంగానేవుంటూ వుంటారు...!

* * *

ఆంధ్రులైన శ్రీ 'కాళాజీ' తోనే ఇది ఆగిపోతే బావుండిపోను. అది అంతటితో ఆగక కాళాజీ పరమగురువులు 'రాజాజీ' మద్రాసు ప్రధాన మంత్రి హోదాలో 'విశాఖపట్టణం' వెళ్లగానే, ఆ పిచ్చికాస్తాఆయన్నుకూడా విడిచి పెట్టిందికాదు—

రాజాజీ పిచ్చి ధోరణికి పిచ్చెక్కిపోయిన విశాఖ విద్యార్థులు ఆయన్ను నానాఅల్లరిచేసి పిచ్చివాణ్ణి తరిమినట్లు తరిమారు...ఆ తరువాత విశాఖపట్టణం వెళ్లిన డా॥ రాజన్ మంత్రిగారికి కూడా విశాఖపట్టణం పిచ్చి వసాళానికి అంటింది...

* * *

కాళాజీ, రాజాజీ, రాజన్‌గార్లలో, ఆ పిచ్చిపొంగు ఆగిపోతే మంచిదే అయ్యేది...

కాని, అది అంతటితో ఆగిపోక ఆంధ్రకేసరికి కూడా కొంత ఆవేశంఎక్కించింది...

1941 లో సర్ విజయా అధ్యక్షతను విశాఖపట్టణంలో జరిగిన ఆంధ్రమహాసభలో_ఆంధ్రకేసరి వెల్లడించిన "అరవ కుంభకోణం" ఆంధ్రరాజకీయాలనేకాదు_ ఇటు దక్షిణాది నాయకత్వాన్ని, అటు ఉత్తరాది నాయకత్వాన్ని కూడా పిచ్చెక్కించేసింది...!

రాజాజీ మొదలు గాంధీజీవరకు బుజాలు తడుముకున్నారు...

లండన్‌లో రాధాకృష్ణయ్య, రాఘవేంద్రరావులు రహస్యంగా పత్రాలు పట్టుకొని రాజాజీ రంగును బైటపెట్టారు...

అదిమొదలు_"రాజాజీ"కి విశాఖ పట్టణం పేరు చెబితే -పిచ్చాసుపత్రిజ్ఞాపకంవస్తూవుంటుంది...

* * *

ఆంధ్రులను, అరవ వారిని మాత్రమేగాదు విశాఖపట్టణ వాతావరణం_ ఆధినివేశ ప్రభుత్వ ప్రధానిని కూడా_వెర్రెక్కించేసింది.

'జలఉష' కు జలప్రవేశోత్సవం చేయడానికి వచ్చిన జవహర్ పండితుణ్ణికూడా 'ఆంధ్రఆవేశం' ఆవహించి_కొంచెం పిచ్చిగా మాట్లాడించింది...

ఆపిచ్చిలోఆయన ఆంధ్రులకుఆంధ్రత్వమనేది ఓ 'హిస్టీరియా' అయిపోయిందన్నాడు ఆంధ్రులు కూపస్థమండూకాలు అన్నాడు...

విశాఖపట్నంలో అంతగా వెర్రెక్కిపోయిన నెహ్రూ పండితుడు విశాఖను వదిలి వెళ్లుతూనే వొట్టి భోళామనిషిలా ఓ వెర్రినవ్వు నవ్వేశాడు...!

— ఇంతకీ పిచ్చి పండితుడు...'విశాఖ'లో పిచ్చి ఆసుపత్రి వున్నదని తెలిసికూడా అలా పిచ్చెక్కిపోవడమేమిటి? పిచ్చితనం కాకపోతే!

ఏమైనామా విశాఖ "పిచ్చిఅసుపత్రి" అంటే యథార్థంగా ఓ 'కుచ్చు తలపాగా"లా మాకు నచ్చిబాగై, గర్వకారణమౌతోంది...!

"ఆంధ్రత్వ" మంటే నసుక తెలియనివాళ్లు కొందరు వొట్టి ఆవకాయ తత్వం అనుకున్నారు... ఇప్పుడు "పిచ్చి ఆసుపత్రి" అనుకుంటారేమోగాని—వెయ్యి చెప్పండి.....లక్ష చెప్పండి వెర్రికి వేయి విధాలన్నారు...

మా ఆంధ్రత్వానికి విశాఖ ఒక విలక్షణం— పిచ్చి ఆసుపత్రి ఓ కుచ్చు తలపాగా....,

జై విశాఖపట్నానికి జై
జై పిచ్చి ఆసుపత్రికి జిందాబాద్.